
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

ఆదివారం 10 మార్చి 2024

వైసీపీ తాయిలాలు సిద్ధం



వైసీపీ అధినేత సీఎం జగన్ సిద్ధం పేరిట ఎన్నికల ప్రచారానికి తెరలేపగా ఆయన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, నేతలు మళ్లీ గెలిచేందుకు ఓటర్లకు కీలకంగా ఉండే వ్యక్తులకు తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. కొందరు రిపోర్టర్లకు ఓ విడతగా గిఫ్ట్‌ప్యాక్‌ను ఇవ్వగా, రెండో విడతలో చీరలు, బట్టలు అందించారు. ఇక మహిళా ఓటర్ల కోసం చీరలు ఇచ్చి ఎరవేసే ప్రయత్నం చేయడం గమనార్హం. ఈ తాయిలాలు ఇప్పటికే పులివెందుల, ప్రొద్దుటూరు, కడపలో పంపిణీ చేయగా.. మైదుకూరులో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే లోపే వలంటీర్ల ద్వారా తాయిలాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.



- మహిళలకు చీరలతో ఎర
- ఇప్పటికే పులివెందుల, ప్రొద్దుటూరులో పంపిణీ
- మైదుకూరులో గోడ గడియారాలు, చీరలు పంపిణీకి సిద్ధం
- కొందరు విలేకరులకు గిఫ్ట్‌లు పంపిణీ చేసిన వైనం



(కడప-ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో విచ్చలవిడిగా ఓటుకు నోటు పంపిణీ కార్యక్రమం చేశారంటారు. ఒక్కోసారి అప్పట్లో ఓటుకు రూ.2వేల దాకా ఇచ్చారని ప్రచారం జరిగింది. అయితే 30 ఏళ్ల తానే సీఎంగా ఉంటా అంటూ పాలన అందిస్తానని జగన్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అన్ని వర్గాల్లో జగన్ పాలనపై అసహనం వ్యక్తమవుతోంది. భూకబ్జాలు, దాడులు, ప్రత్యర్థులకు బెదిరింపులు, కేసులు పెట్టడం లాంటివి చేస్తుండడంతో జనాలు విసిగిపోయి ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం..

ఎలాగైనా సరే మళ్లీ అధికారంలోకి రావాలని వైసీపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. జిల్లాలో కూడా కొంతమంది ఎమ్మెల్యేలు మళ్లీ గెలిచేందుకు చీరలు, గిఫ్ట్‌లతో ఎరవేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆసరా సొమ్మును ప్రభుత్వం విడుదల చేసింది. ఇందుకు గాను సమావేశం ఏర్పాటు చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని తొండూరులో ఆసరాకు హాజరైన మహిళలకు చీరలు తాయిలాలుగా ఇచ్చారు. పులివెందులలో వివేకా హత్య తరువాత వ్యతిరేకత రావడం, వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టడంతో పులివెందులలో మహిళా ఓటర్లను మంచి చేసుకునేందుకు ముందుగానే చీరలు పంపిణీ చేశారనే చర్చ నడిచింది. ఇక ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రెండురోజుల క్రితం డ్వాక్రా యానిమేటర్లు, సీసీలకు గిఫ్ట్‌బాక్సులు అందించారు.. రిటైర్ అయ్యే యానిమేటర్లకు వారిపై నగదు డిపాజిట్ చేసి బాండ్లను అందించి సన్మానం చేస్తామని చెప్పుకొచ్చారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మోరగుడి గ్రామానికి చెందిన ఓ ఆలయానికి రూ.50వేలు, ఇల్లు లేదని పలుమార్లు ఆయన దృష్టికి తేవడంతో ఓ బాధితుడికి రూ.20వేలు సాయం అందించారు. ఎన్నికల వేళ కావడంతో అడిగిన వెంటనే సాయం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇక మైదుకూరులో వలంటీర్లు మరికొంత మందికి పంచేందుకు 30వేల వాల్‌క్లాక్‌లు, మరో 30వేల చీరలు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. వీటితో పాటు స్వీటు బాక్సును గుర్తించినవారికి మొదటి విడతలో వలంటీర్ల ద్వారా అందించేందుకు సిద్ధం చేసినట్లు చెబుతారు.

కొందరు విలేకరులకు..

వైసీపీ నేతలు కొందరు విలేకరులకు గిఫ్ట్‌బాక్సులు, చీరలు, బట్టలతో ఎరవేస్తున్నారు. ఇప్పటికే ఒక విడత వైసీపీ గుర్తించిన వారికి పవర్‌బ్యాంకుతో కూడిన గిఫ్ట్‌లు అందించగా ఇటీవల చీర, ఇతర దుస్తులు ఇచ్చినట్లు చెబుతారు. కడప ప్రొద్దుటూరు, పులివెందులలో ఇప్పటికే పంపిణీ జరిగిందని సమాచారం. ఇలా మొత్తానికైతే షెడ్యులు రాకముందే తాయిలాలతో వైసీపీ సిద్ధంగా కనిపిస్తోంది.

వలంటీర్లకు షాక్

- మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో పాల్గొన్న వారికి మెమో

కడప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కట్టే పన్నుతో ప్రభుత్వం వలంటీర్లకు జీతం ఇస్తుంది. అంటే కేవలం వాళ్ల ప్రభుత్వ కార్యక్రమాల్లోనే పాల్గొనాల్సి ఉంది. అయితే కొందరు వలంటీర్లు బరితెగిస్తున్నారు. వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారు. ఇటీవల బ్రహ్మంగారిమఠంలో వైసీపీ నేతలు నిర్వహించిన మేము సిద్ధం మా బూత్ సిద్ధం అంటూ ప్రచార కార్యక్రమంలో సోమిరెడ్డిపల్లె 1 సచివాలయంలో పనిచేస్తున్న వలంటీర్లు పాల్గొన్నారు. బ్యానర్లు పట్టుకుని వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించారు. దీనిపై మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ కలెక్టరుకు, బద్వేలు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. బ్రహ్మంగారిమఠం ఎంపీడీఓ మల్లేశ్వరప్ప సిద్ధం బ్యానర్లు పట్టుకున్న వలంటీర్లు వరలక్ష్మి, నిర్మల, జ్యోతి, మౌనిక, రూథమ్మ, అనిల్, సుదర్శన్‌రెడ్డి, సోమ్లనాయక్, శివరాం, శివలకు మెమో ఇచ్చారు. వలంటీర్లుగా ఉండి ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో ఎందుకు పాల్గొన్నారు.. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలంటూ మెమో ఇచ్చారు. ఈ వ్యవహారం దుమారం రేపింది. దీంతో నాలిక్కరచుకున్న వలంటీర్లు అది ప్రభుత్వ కార్యక్రమమని వెళ్లామని, పార్టీ కార్యక్రమమని తెలియదని.. ఇక మీదట మేం వెళ్లబోమంటూ లిఖితపూర్వకంగా రాసిచ్చినట్లు బి.మఠం ఎంపీడీఓ మల్లేశ్వరప్ప ఆంధ్రజ్యోతికి వెల్లడించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి బహిరంగంగా వైసీపీకి తొత్తులుగా వ్యవహరించే కొందరు వలంటీర్లకు ఇది షాక్ లాంటిదే. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరికలు పంపించారు.

ఒంగోలు సిద్ధం సభకు 135 ఆర్టీసీ బస్సులు కేటాయింపు

- బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు



మైదుకూరు బస్టాండులో కిక్కిరిసిన ప్రయాణికులు

కడప, మార్చి9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సేవలో ఆర్టీసీ తరిస్తోంది. జగన్ సభలకు బస్సులు కావాలని అడిగిందే తడవుగా జనాలను పట్టించుకోకుండా ఎడాపెడా కేటాయిస్తోంది. గత నెలలో అనంతపురంలో నిర్వహించిన సిద్ధం సభకు జిల్లా నుంచి బస్సులు తీసుకెళ్లడంతో ప్రయాణికులు నరకం చూశారు. తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఒంగోలు జిల్లాలో నిర్వహించే సిద్ధం సభకు జిల్లా నుంచి 135 బస్సులను కేటాయించారు. దీంతో బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కడప, బద్వేలు మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్టీసీ డిపోలున్నాయి. వరుసగా మూడురోజులు సెలవులు వచ్చారు. ఇందులో శివరాత్రి కూడా వచ్చింది. కొందరు ఊర్లకు వెళ్లారు. మరికొందరు శైవక్షేత్రాలకు వెళ్లారు. శివరాత్రికి స్పెషల్ బస్సులు వేయడంతో రోజువారి బస్సులు అందుబాటులో లేకుండాపోయాయి. దీనికి తోడు 135 బస్సులు సిద్ధం సభకు కేటాయించారు. జిల్లాలో మొత్తం 549 బస్సులు ఉన్నాయి. వాటిలో 135 బస్సులను సిద్ధం సభకు కేటాయించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కడప, మైదుకూరు ఆర్టీసీ బస్టాండులలో ప్రయాణికులు బస్సులు లేక అగచాట్లు పడ్డారు.

ముగ్గురికి డీసీవోలుగా పదోన్నతులు

కడప(రూరల్), మార్చి 9: కో-ఆపరేటివ్ సెక్టార్‌లో పనిచేస్తున్న ముగ్గురు అధికారులకు ప్రభుత్వం సహకారశాఖ జిల్లా అధికారులు(డీసీవో)గా పదోన్నతులు కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు కడప డీసీసీ బ్యాంకులో ఓఎస్డీగా పనిచేస్తున్న గుర్రప్పకు నెల్లూరు జిల్లా సహకారశాఖ జిల్లా అధికారిగా(డీసీవో)గా పదోన్నతి కల్పించారు. అలాగే సహకార శాఖ ఆడిట్ అధికారిగా పనిచేస్తున్న అరుణకుమారిని అనంతపురం జిల్లా డీసీవోగా, కడప సహకారశాఖ ఇన్‌చార్జ్‌గా డీసీవోగా పనిచేస్తున్న సుభాషిణిని ఇదే స్థానంలో రెగ్యులర్ డీసీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 16 సంవత్సరాల తరువాత ప్రమోషన్లు కల్పించడంతో కో-ఆపరేటివ్ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మైనార్టీలను మోసగించిన జగన్‌రెడ్డిని తరిమికొట్టండి

- శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్
- కడపలో ముస్లిం మైనార్టీ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

కడప (మారుతీనగర్), మార్చి 9: ముస్లిం మైనార్టీలను మోసగించిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొట్టాలని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా కార్యదర్శి జమీల్ సారథ్యంలో శనివారం స్థానిక సంఘం ఫంక్షన్ హాలులో తెలుగుదేశం పార్టీ ముస్లిం-మైనార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా షరీఫ్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమాజంలోని అన్నివర్గాలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మానభంగాలు, అక్రమ కేసులు బనాయించడంతోనే సరిపోయిందన్నారు. సమాజంలో శాంతిని కోరుకునే ముస్లిం, మైనార్టీలను సైతం తీవ్ర ఇబ్బందులపాలు చేస్తున్న తీరు బాధాకరమన్నారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి నాటి దివంగత టీడీపీ అధినేత ఎన్టీఆర్, ప్రస్తుత అధినేత నారా చంద్రబాబు ఎంతగానో దోహదపడ్డారని గుర్తుచేశారు. గత ఐదేళ్లుగా బీజేపీకి మద్దతు తెలుపుతున్న వైసీపీ పాలనలో ముస్లింలకు న్యాయం జరిగింది లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో టీడీపీ కలసి ఎన్నికలకు వెళుతోందని.. 2014లో బీజేపీతో పొత్తులో ఉన్నా ముస్లింలకు టీడీపీ అనేక పథకాలు అమలు చేసిన సంగతి గుర్తు చేశారు. ప్రత్యేకంగా మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటుచేసి సబ్సిడీతో కూడిన రుణాలతో పాటు దుల్హన్ పథకం కింద టీడీపీ 5 సంవత్సరాల పాలనలో సుమారు 38 వేలమందికి చేయూత కల్పించిందన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో కేవలం 3 వేల మందికి మాత్రమే అందించారన్నారు. రంజాన్ తోఫాను సైతం వైసీపీ సర్కార్ రద్దుచేసి పేదల నోట్లో మట్టికొట్టడం బాధాకరమన్నారు. ముస్లిం మైనార్టీలను ఓట్లు అడిగే అర్హత వైసీపీ సర్కార్‌కు లేదన్నారు.

కడప అభివృద్ధిపై టీడీపీ మేనిఫెస్టో విడుదల

కడప అసెంబ్లీ నుంచి తాను విజయం సాధించిన తర్వాత నగర అభివృద్ధికోసం రూపొందించిన మేనిఫెస్టోను షరీఫ్ తదితరులతో కలసి ఆర్.మాధవీరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా అంజాద్‌బాషా జోడు పదవుల్లో కొనసాగుతున్నా నాలుగు సంవత్సరాల పది నెలల కాలంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప మరేమీ చేయలేదన్నారు. ముఖ్యంగా కడపను మాదక ద్రవ్యాలకు అడ్డాగా చేశారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన కడపకు విముక్తి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి జమీల్, నాయకులు జిలానీ బాష, రబ్బానీ, హాఫీజుల్లా, అప్సర్‌ఖాన్, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



కడప నగర అభివృద్ధిపై టీడీపీ మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజల్లో భరోసా కల్పించేందుకే రూట్‌మార్చ్ : ఎస్పీ

కడప (క్రైం), మార్చి 9: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భరోసా కల్పించడంలో భాగంగా రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ తెలిపారు. ప్రజలందరూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు సహకరించుకోవాలన్నారు. శనివారం పెద్దముడియం మండలంలోని సుద్దపల్లెలో, చెన్నూరు, వల్లూరు పరిధిలోని అంబవరం, కొప్పోలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలచే రూట్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు.



చెన్నూరులో రూట్‌మార్చ్

సమస్యలు చెబితే చితకబాదారు

- వైసీపీ నేతలపై ఫిర్యాదు



గాయపడిన కొప్పు వెంకటేశ్వర్లు

పోరుమామిళ్ల, మార్చి 9: తమ గ్రామంలో సమస్యలు పరిష్కరించలేదని చెప్పిన వ్యక్తిని వైసీపీ నాయకులు చితకబాదారు. బాధితుడి కథనం మేరకు.. శనివారం పోరుమామిళ్ల మండలం అగ్రహారంలో ఎమ్మెల్యే సుధ పర్యటించారు. ఈ సందర్భంగా కొప్పు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మాట్లాడుతూ.. తమ గ్రామంలో ఒక్క సమస్యా పరిష్కరించలేదని, ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేదని ఎమ్మెల్యేను నిలదీశారు. అమె అక్కడి నుంచి వెళ్లిపోయిన కాసేపటికి అదే గ్రామానికి వైసీపీ నేతలు సన్నపురెడ్డి చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సన్నపురెడ్డి క్రిష్టారెడ్డి, వారి అనుచరులు దుర్భాషలాడుతూ కొప్పు వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. దీనిపై శనివారం రాత్రి బాధితుడు పోరుమామిళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



పర్యటన ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పులివెందుల టౌన్, మార్చి 9: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 11వ తేదీ సోమవారం పులివెందులలో పర్యటించనుండటంతో ఆ మేరకు ఏర్పాట్లను శనివారం కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. కడప విమానాశ్రయం, ఇడుపులపాయ ఎస్టేట్, పులివెందులలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేశ్‌కుమార్ తదితరులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాల్లో పాల్గొనే అధికారులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా ఉండాలని, తాగునీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమాల వద్ద ప్రోటోకాల్ మేరకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మొదటి హామీయే గాలికి

- విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తానని జగన్ హామీ
- ప్రజా సంకల్పయాత్రలో ఇదే మొదటి హామీ
- అధికారం చేపట్టాక జగన్ మొండిచేయి
- 24వేల మంది కాంట్రాక్టు కార్మికుల ఆవేదన

ఒక్క నిమిషం విద్యుత్ లేకపోతే అల్లాడిపోయే సమయమిది. అలాంటి విద్యుత్ సక్రమంగా అందజేసేందుకు నిరంతరం పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ మొదటి హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఐదేళ్లవుతున్నా ఇప్పటివరకు ఆ హామీని పట్టించుకోలేదు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఇదే పనిచేసే కార్మికులకు దాదాపు రూ.10వేల వరకు జీతం ఎక్కువగా ఉంది. మొదటి హామీని అమలు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ఎవ్వరూ పట్టించుకోలేదని, కనీసం సీఎం వైఎస్ జగన్‌ను కలిసేందుకు వెళ్లినా దరిదాపులకు వెళ్లనివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ తమను నమ్మించి మోసం చేశాడంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 24వేలమంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తమను రెగ్యులర్ చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలంటూ ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు (ఫైల్‌ఫొటో)

ఎర్రగుంట్ల, మార్చి 8: విద్యుత్ శాఖలో సుమారు 28 ఏళ్ల నుంచి పనిచేసే కార్మికులు వేలల్లో ఉన్నారు. చాలీచాలని జీతాలతో దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న కుటుంబ ఖర్చులతో చాలీచాలని జీతాలతో ఎన్నో అవస్థలు పడుతున్నారు. మరికొందరు రిటైర్‌మెంటుకు దగ్గరలో ఉన్నారు. వీరు తాము రిటైర్ అయ్యేలోపు అయినా రెగ్యులర్ అవుతామో లేదో అనే ఆందోళనలో ఉన్నారు.


ఇదీ మొదటి హామీ..

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో.. కాంట్రాక్టు కార్మికులు దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారందరిని రెగ్యులర్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో 2017 నవంబరు 6న జగన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించారు. అదే ఏడాది నవంబరు 9వ తేదీ సాయంత్రం ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలిలో అశేష జనవాహిని మధ్య ఏర్పాటు చేసిన సభలో ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్ మాట్లాడారు. పక్కనే ఉన్న ఏపీ జెన్‌కో ఆర్టీపీపీలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు, ట్రాన్స్‌కో ఇతర విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న వేలాదిమంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులందరినీ ఒక పద్ధతి ప్రకారం రెగ్యులర్ చేస్తామని, అందరికి తోడు ఉంటానని మొదటి హామీగా ప్రకటించారు. ఇలా అన్ని జిల్లాల్లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల విషయంలో పాదయాత్ర ముగిసేంత వరకు హామీ ఇస్తూనే వెళ్లారు. దీన్ని నమ్మిన కార్మికులు గంపగుత్తగా తమతోపాటు, తమ కుటుంబీకులు బంధువులతో ఓట్లు వేయించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రెగ్యులర్ చేయాలని వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన కార్మికులను కనీసం కలిసేందుకు కూడా జగన్ ఇష్టపడలేదు, అనుమతి ఇవ్వలేదు. ఎన్నోసార్లు ఇడుపులపాయ, పులివెందులకు వచ్చినా కార్మికులు కలిసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో జగన్‌రెడ్డి ఇచ్చిన మొదటి హామీ విషయంలో మాటతప్పి-మడమతిప్పి మమ్మల్ని మోసం చేశాడని కార్మికులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఒకటిన్నర నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటి కూడా కార్మికులు రెగ్యులర్ చేస్తారన్న దింపుడు కళ్లెం ఆశతో ఉన్నారు.

పెంచింది తూతూ మంత్రంగానే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జీతభత్యాలు ఒకే విధంగా ఉండేవి. రాష్ట్రం విడిపోయిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం 23వేల మంది కార్మికులను సంస్థలో విలీనం చేసింది. ప్రస్తుతం వారందరూ రెగ్యులర్ ఉద్యోగులుగా ఉంటూ సుమారు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు జీతాలు పొందుతున్నారు. మన రాష్ట్రంలో 2023లో కాంట్రాక్ట్ కార్మికులు పెద్దఎత్తున సమ్మె చేసినప్పటికి పెంచింది అరకొరమాత్రమే. ప్రస్తుతం రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అన్‌స్కిల్డ్‌కు రూ.22,318, సెమీ స్కిల్డ్‌కు రూ.23,236, స్కిల్డ్‌కురూ.27,953 వేతనాలు ఇస్తోంది. అదే తెలంగాణలో అన్‌స్కిల్డ్ రూ.29,637, సెమిస్కిల్డ్ రూ.33,482, స్కిల్డ్ రూ.38,594 జీతాలను విద్యుత్ సంస్థల ద్వారా నేరుగా పొందుతున్నారు. మన రాష్ట్రంలో కాంట్రాక్టర్ ద్వారా జీతాలిస్తుండటంతో వారి కమిషన్ ఇవ్వాల్సి ఉంది. కనీసం నేరుగానైనా జీతాలివ్వాలని అనేకసార్లు కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ కార్మికులకు, ఇక్కడి కార్మికుల జీతాలకు సుమారు రూ.10వేలు వ్యత్యాసముందని కార్మికులు వాపోతున్నారు. చంద్రబాబు పెంచిన జీతాలతో పాటు 13 నెలల అరియర్స్ ఇచ్చారని.. జగన్ మాత్రం 2022లో ఏప్రిల్‌లో పెంచాల్సిన జీతాలను 2023 ఆగస్టులో పెంచి 14నెలల అరియర్స్ ఇవ్వకుండా మొండిచేయి చూపారని కార్మిక వర్గాలు మండిపడుతున్నాయి. దీంతో ఒక్కొక్క కార్మికుడు సుమారు లక్ష వరకు నష్టపోయాడని వాపోతున్నారు.


సీఎం ఇప్పటికైనా నెరవేర్చాలి..



పాతికేళ్లుగా సంస్థలో పనిచేస్తున్నాం. అయినా చాలీచాలని జీతాలే. రెగ్యులర్ ఉద్యోగులు చేసే పనినే మేమూ చేస్తున్నాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి. తెలంగాణ కార్మికలతో పోలిస్తే మేము చాలా నష్టపోతున్నాం. జగన్ సీఎంగా అధికారం చేపట్టాక నాలుగున్నరేళ్ల తర్వాత అరకొర జీతాలు పెంచాడు. కనీసం సంస్థలోకి విలీనం చేసి నేరుగా జీతాలివ్వాలని కోరినా పట్టించుకోలేదు. ఇచ్చిన మొదటి హామీని ఇప్పటికైనా జగన్ నెరవేర్చాలి.

\- చంద్రశేఖర్, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రాష్ట్ర క్యాదర్శి

తీవ్ర అన్యాయం చేశారు..



టీడీపీ హయాంలో కూడా రెగ్యులర్ చేస్తామని చేయలేదు. అయితే జీతాలు రెట్టింపు చేశారు. అలాగే అరియర్స్ 13 నెలలది ఇచ్చారు. వైఎస్ జగన్ ప్రభుత్వం 2022 ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు ఇవ్వాల్సి ఉంది. 2023 ఆగస్టు నుంచి మాత్రమే పెంచిన జీతాలు ఇచ్చారు. ఒక్కో కార్మికుడు లక్షరూపాయలు అరియర్స్ రూపంలో నష్టపోయాడు. మాకు తీరని అన్యాయం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి మాటలు నమ్మి నాడు ఒక్కొక్కరం పదిఓట్లు వేయించాము. నేడు 20ఓట్లు వ్యతిరేకంగా వేయిస్తాం.

\- సాంబశివారెడ్డి, విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల నాయకుడు, ఆర్టీపీపీ

విద్యుత్ తీగలు తగిలిన విద్యార్థి మృతి



సింహాద్రి (ఫైల్)

ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

బి.కోడూరు, మార్చి 9 : మండల పరిధిలోని తంగేడుపల్లెలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగలడంతో బత్తల సింహాద్రి (12) అనే విద్యార్థి మృతి చెందాడు. తంగేడుపల్లెకు చెందిన బత్తల సిద్దయ్య పెద్ద కుమారుడు గురువారం మేకలు మేపుకుంటుండగా సింహాద్రి తన అన్నకు అన్నం తీసుకుని వెళుతుండగా పొలాల్లో ఓ రైతు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు తెగి కింద పడి ఉన్నాయి. అది గమనించక ఆ విద్యార్థి దానిపై వెళ్లడంతో కాళ్లకు చుట్టుకుని పూర్తిగా శరీర భాగాలు కాలిపోయాయి. దీంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కాగా మృతుడు సింహాద్రి బద్వేలు ప్రభుత్వ పాఠశాలలో 6వతరగతి చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకుడు

ముద్దనూరు మార్చి 9: మండల పరిధి జమ్మలమడుగు రోడ్డులోని పులికోన ఘాట్ వద్ద శనివారం సాయంత్రం బైకు ప్రమాదంలో గుర్తు తెలియని యువకునికి తీవ్రగాయాలయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తి బైకుపై జమ్మలమడుగు వైపు నుంచి వస్తూ అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే ఆ దారిన వస్తున్న ప్రయాణికులు చూసి 108కు సమాచారం అందించారు. తీవ్ర గాయాలవడంతో 108లో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం అక్కడినుంచి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రూ.20 లక్షలు స్వాధీనం

ఎర్రగుంట్ల, మార్చి 9: ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డు వై-జంక్షన్ వద్ద శనివారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తుండగా ప్రొద్దుటూరుకు చెందిన మార్తల వెంకటరామిరెడ్డి వద్ద నుంచి రూ.20 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా వెంకటరామిరెడ్డి వై-జంక్షన్ వద్ద బ్యాగు పట్టుకుని అనుమానాస్పదంగా నిలుచున్నాడని, తనిఖీ చేయగా అతడి వద్ద రూ.20 లక్షలు ఉన్నట్లు తెలిపారు. అతను కర్నాటక నుంచి హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌కు వచ్చి ఎర్రగుంట్లలో దిగాడు. బస్సు కోసం ప్రొద్దుటూరు రోడ్డు వై-జంక్షన్ వద్ద ఉండగా సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో తనిఖీలు చేయగా నగదు దొరికినట్లు తెలిపారు. డబ్బు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపామన్నారు. అలాగే గోవా నుంచి నాలుగు లీటర్ల మద్యంతో వాస్కోడిగామా ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి ఎర్రగుంట్లలో దిగిన దువ్వూరుకు చెందిన ఇరగంరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

37 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం, మార్చి 9: పట్టణంలో 37 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొండాపురం గ్రామానికి చెందిన నారాయణ 37 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

ఇటుకులపాడులో గడ్డివామి దగ్ధం



కాలిపోయిన గడ్డివామి

కాశినాయన మార్చి 9: ఇటుకులపాడులో అనుమానాస్పద స్థితిలో పాములూరి వెంగటయ్యకు చెందిన గడ్డివామి దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు, బాధితుల వివరాల మేరకు... శనివారం సాయంత్రం ఉన్నఫళంగా గడ్డివామిలో మంటలను గుర్తించి స్థానికులు పోరుమామిళ్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చేలోపు గడ్డివామి పూర్తిగా కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. ప్రమాదంలో 300 కట్టల గడ్డికాలిపోయిందని, దాదాపు రూ.30 వేలు నష్టం వాటిల్లిందన్నారు.

పారదర్శకంగా ఇంటర్ పరీక్షలు

ఆర్ఐవో వెంకటసుబ్బయ్య



ఆర్ఐవో కార్యాలయంలో సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్న అధికారులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆర్ఐవో కార్యాలయంలో ఇంటర్మీడియట్ బోర్డు నుంచి సైతం పర్యవేక్షణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్ కాపీయింగ్‌కు ఎటువంటి తావు లేకుండా పరీక్షలు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు. గత ఏడాది కంటే విద్యార్థులు ఈ ఏడాది పెరిగారని 69 కేంద్రాల్లో ఈ పరీక్షలు రాస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్ ఒకేషనల్ కోర్సులకు బీజువాలజీ, హిస్టరీ పరీక్షలకు 14,758 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 14,152 మంది హాజరయ్యారన్నారు. 606 మంది గైర్హాజరైనట్లు ఆయన వివరించారు.

న్యూఢిల్లీ సాహితీ సదస్సుకు వేంపల్లె గంగాధర్



కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9: న్యూఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో పాల్గొనడానికి జిల్లాకు చెందిన రచయిత డాక్టర్ వేంపల్లె గంగాధర్‌కు ఆహ్వానం అందింది. న్యూఢిల్లీలోని రవీంద్రభవన్‌లో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయ సదస్సులో పాల్గొననున్నారు. మార్చి 13న జరిగే వివిధ ప్రాంతీయ భాషల కథల ఆవిష్కరణ కార్యక్రమంలో ఈయన తెలుగు కథ వినిపించనున్నారు. జిల్లాకు చెందిన ఈయన ఇప్పటివరకు మొలకల పున్నమి, దేవరశిల, గ్రీష్మభూమి, పాపాఘ్ని కథలు, రావణ వాహనం కథలు, గంగమ్మపూలు కథా సంపుటాలు, నేల దిగినవాన, యురేనియం మింగిన పల్లె నవలలు ప్రచురించారు. మొలకల పున్నమి కథల సంపుటానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారాన్ని 2011లో అందుకున్నారు.

ఆరుగురు ఎస్‌జీటీలకు పదోన్నతులు



పదోన్నతుల కౌన్సెలింగ్‌లో డీఈఓ అనురాధ

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9: జిల్లాలో ఆరుగురు ఎస్‌జీటీలకు స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినట్లు జిల్లా విద్యా శాఖ అధికారిణి అనురాధ తెలిపారు. శనివారం కడప నగరం డీఈఓ కార్యాలయంలో స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ చేసిన అభ్యర్థులకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ చేసిన ఆరుగురు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూలు అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించామన్నారు. కార్యక్రమంలో డీఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు పరీక్ష..!



- ఎన్నికలు వస్తున్నాయని 'నాడు-నేడు' నిధులు మంజూరు
- పనులు త్వరగా పూర్తి చేయాలంటూ హెచ్‌ఎంలపై వత్తిడి
- టెన్త్ పబ్లిక్ పరీక్షల వేళ పనులు చేసేదెలా?
- తలలు పట్టుకుంటున్న హెచ్‌ఎంలు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం నిధుల కొరతతో పడకేసింది. ఈ పథకంలో రెండో దశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. రెండో విడత పనులు 2022 జూలై నాటికి పూర్తి చేస్తామని అప్పట్లో ప్రకటించారు. తర్వాత మరో ఏడాది పొడిగించారు. అయినా నిధులు విడుదల కాక పనులు అరకొరగా నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం కొంతమేర నిధులు విడుదల చేసి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులపై వత్తిడి తెస్తోంది. ఓ పక్క ఈ నెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు, మరో పక్క నాడు నేడు పనులు పూర్తిచేయాలని వత్తిడి. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో ప్రధానోపాధ్యాయులు సతమతమవుతున్నారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు కూడా మండిపడుతున్నాయి.



చాపాడు మండలంలో పునాదులకే పరిమితమైన ఓ ప్రాథమిక పాఠశాల

కడప (ఎడ్యుకేషన్), మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఫేజ్-1 కింద పాఠశాలల్లో పనులు పూర్తి చేసింది. ఫేజ్-2 కింద పాఠశాలలు ఎంపిక చేసి ఒకటిన్నర సంవత్సరం కావస్తోంది. దీనికి నిధులు మంజూరు చేసి మరమ్మతులు పూర్తికాకముందే నిధులు పెండింగ్ పెట్టింది. దీంతో నాడు-నేడు పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నిధులు సకాలంలో విడుదల చేస్తే నాడు-నేడు పనులు పూర్తి చేస్తామని ప్రధానోపాధ్యాయులు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. ప్రస్తుతం పరీక్షలు, ఎన్నికలపై పాఠశాల సిబ్బంది నిమగ్నమైన ఉన్న వేళ అరకొర నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం నాడు-నేడు పనులు ప్రారంభించాలని తొందరపెడుతోంది. దీంతో సంబంధిత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు తీవ్ర వత్తిడికి గురవుతున్నారు. విద్యా సంవత్సరం చివరిలో నిధులు విడుదల చేస్తే ఏ విధంగా పనులు పూర్తవుతాయని ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు జరిగిన పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు, ఎఫ్ఎ-4 మూల్యాంకనం, ఆన్‌లైన్ మార్కుల నమోదుపై పూర్తి స్థాయిలో పాఠశాల సిబ్బంది నిమగ్నమై ఉన్న సందర్భంలో నాడు-నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించడం పట్ల విమర్శలు వస్తున్నాయి.

గత ఏడాదీ ఇదే తీరు..

గత సంవత్సరం సైతం చివర్లో నిధులు మంజూరు చేసి ఉపాధ్యాయులతో వేసవి సెలవుల్లో నాడు-నేడు పనులు చేయించింది. ఈ ఏడాది ఒక వైపు ఎన్నికల విధులకు సంబంధించిన శిక్షణ జరుగుతుంటే మరో వైపు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేంద్రాలను, విద్యార్థులను సిద్ధం చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికల రూపు దిద్దుకుంటుంటే.. నాడు-నేడు పనులు సక్రమంగా జరుగుతాయా అన్న ప్రశ్న తలెత్తుతోంది. తక్కువ సమయంలో ఆదరా బాదరాగా పనులు పూర్తి చేస్తే రాబోవు ఆడిట్‌లో ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురికాక తప్పదని పలువురు బహిరంగంగా మాట్లాడుతున్నారు. జిల్లాలో ఒక పాఠశాలకు ఇంకా రూ.30 లక్షలకు పైగా నిధులు మంజూరు కావాల్సి ఉంటే కేవలం రూ.10 లక్షలు మాత్రమే విడుదల చేశారు. దీంతో ఏ పనులకు ఎంత ఖర్చు పెట్టాలో అర్థంకాక ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. అన్ని పాఠశాలల పరిస్థితి అలాగే ఉంది. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో నాడు నేడు పనులు ఏ విధంగా కొనసాగించాలని వాపోతున్నారు. ఒకటిన్నర నెలలో విద్యా సంవత్సరం ముగుస్తుండగా ఈ ఆర్భాటమేమిటి, ఎన్నికల కోసమే ఈ ఆరాటం అని పలువురు పేర్కొంటున్నారు. పాఠశాల సిబ్బందిపై వత్తిడి చేసి ఎలాగైనా ఎన్నికల కోడ్ ముందే పనులు పూర్తిచేయించడానికి ప్రభుత్వం సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది.

రెండో విడత వివరాలిలా..

నాడు-నేడుకు సంబంధించి జిల్లావ్యాప్తంగా రెండో విడత కింద 87 అంగన్వాడీ కేంద్రాలు, 637 ప్రాథమిక పాఠశాలలు, 75 ప్రాథమికోన్నత పాఠశాలలు, 197 హైస్కూళ్లు, 9 జూనియర్ కళాశాలలు మొత్తం 1005 వాటిలో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటిలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్ షెడ్డు, ఇంగ్లీషు ల్యాబ్, పెయింట్ తదితర పనులు చేసేందుకు నిర్ణయించింది. దీని కోసం ప్రభుత్వం రూ.296.62 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఇందులో రూ.147.81 కోట్లు నిధులను ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టారు. ఆ తరువాత నిధులు మంజూరు కాకపోవడంతో కొన్ని పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం నాడు-నేడు పనుల్లో భాగంగా తాజాగా 809 పాఠశాలలకు రూ.21.28 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాఠశాలల్లో పెండింగులో ఉన్న పనులు త్వరితంగా పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులపై వత్తిడి తెస్తున్నారు. మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారు. ఇదే సమయంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు కూడా జరగనున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులపై మరింత వత్తిడి పెరిగిందని చెప్పాలి. ఒక పక్క పదో తరగతి పరీక్షలు నిర్వహించాలా, మరో పక్క నాడు-నేడు పనులు పూర్తిచేయాలా అంటూ తలలు పట్టుకుంటున్నారు.

పెండింగు నిధులు మంజూరు చేయాలి..



నాడు-నేడు పాఠశాలలకు ఉన్న పెండింగు నిధులు త్వరితగతిన విడుదల చేయాలి. ఉపాధ్యాయులను నాడు-నేడు బాధ్యతల నుంచి తప్పించి పూర్తిగా ఇంజనీరింగ్ విభాగానికి మరలించాలి. పరీక్షలు, ఎన్నికలవేళ ఉపాధ్యాయులు విధుల్లోకి వెళుతున్నందున నాడు-నేడు పనుల నుంచి మినహాయింపునివ్వాలి. లక్ష్య సాధనకు ప్రభుత్వమే ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

నాడు - నేడు ఆలస్యం వల్ల కొంత ఇబ్బందే..



నాడునేడు పనులు పూర్తయి ఉంటే పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో సౌకర్యంగా ఉండేది. నిధులు సకాలంలో విడుదల అయితే పనులు కూడా పూర్తయ్యేవి. సౌకర్యవంతమైన పరీక్ష కేంద్రాల వల్ల విద్యార్థులకు సౌలభ్యంగా ఉండేది. ఇప్పుడు కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తికానందున కొన్ని పరీక్ష కేంద్రాలు రద్దు చేయడం, లేదా మార్పు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

- కె.సురేశ్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

రేపటి నుంచి గంగమ్మ జాతర





గంగమ్మతల్లి మూలవిరాట్, గంగమ్మ తిరుణాలకు వెళ్లే ఆర్చి, (అంతరచిత్రంలో) రోడ్డుకు స్థలమిచ్చిన రైతు రామచంద్రయ్య

సీకేదిన్నె, మార్చి 9: చింతకొమ్మదిన్నె గంగమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభం కానుందని ఆలయ ఈఓ సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతియేటా మహాశివరాత్రి పర్వదినం ముగిసిన మూడవ రోజు నుంచి తిరుణాల ప్రారంభం అవుతుందన్నారు. మొదటిరోజు నిండు తిరుణాల, రెండవ రోజు మైల తిరుణాల నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తిరుణాల ముగిసిన అనంతరం వారాలు ప్రారంభం అవుతాయన్నారు. తిరుణాల ముగిసిన అనంతరం ఉగాదిలోపు ఆదివారాలను ప్రతివారం అమ్మవారికి ఘనంగా నిర్వహిస్తారన్నారు. మొదటివారం 17వ తేదీ, 24వ తేదీ రెండో ఆదివారం, 31న 3వ ఆదివారం, 7వ తేదీ 4వ ఆదివారం నిర్వహిస్తారని వివరించారు.

రోడ్డు ఏర్పాటుతో ప్రతి ఆదివారం పండుగే

గతంలో గంగమ్మ జాతరకు వెళ్లేందుకు దారి సరిగా లేక భక్తులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గమనించిన బయనపల్లె రైతు వినుకోలు రామచంద్రయ్య తన సొంత పొలంలో కడప-రాయచోటి జాతీయ రహదారి నుంచి తిరుణాల వరకు దాదాపు అర ఎకరా వరకు రోడ్డుకు స్థలం ఇచ్చి ఆర్చి నిర్మాణం చేయడంతో భక్తులు రాకపోకల అధికంగా ఉంటున్నాయి. దీంతో గతంలో వారాలతోనే ఆగిపోయే తిరుణాల ప్రస్తుతం ప్రతి ఆదివారం భక్తులతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంటోంది.

అమ్మవారి కల్యాణం ప్రత్యేకత

ఇక్కడ ప్రతి వారం తిరుణాలలో భాగంగా అమ్మవారి కల్యాణం నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. నిండుతిరుణాలలో భాగంగా 11వ తేదీ రాత్రి అమ్మవారి కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతోపాటు ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేస్తారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి

గంగమ్మతల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ, చైర్మన్ తెలిపారు. అదేవిధంగా 11వ తేదీ మొదటి రోజు కోలాటం, బండలాగుడు పోటీలు, ఆర్కెస్ట్రా, ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేశారన్నారు. రెండవ రోజు చెక్కభజన, కోలాటం ఉంటుందన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

ఖాజీపేట, మార్చి 9: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని చెన్నముక్కపల్లె పంచాయతీలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఆర్.నాగయ్య (78) మృతి చెందాడు. కొత్తపల్లెకు చెందిన ఆర్.నాగయ్య ఖాజీపేటకు వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా కడప నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కడప ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు సీఐ రామాంజులు తెలిపారు.

కడపలో వ్యక్తి కిడ్నాప్ కలకలం..!

33 తులాల బంగారం లాక్కెళ్లారని ఆరోపణలు ● విచారణ చేసి చర్యలు తీసుకుంటాం : టూటౌన్ సీఐ

కడప (క్రైం), మార్చి 9: కడప నగరం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి 33 తులాల బంగారు ఆభరణాలను లాక్కెళ్లారని సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం హల్‌చల్ చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు స్థానికుల సమాచారంతో కొన్ని ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. కడప నగరంలోని ఖలీల్‌నగర్‌కు చెందిన ఇలియాస్ తన స్నేహితుడు వినాయక్‌నగర్‌కు చెందిన బిలాల్‌తో కలిసి ఫిబ్రవరి 19న దుబాయ్ వెళ్లి వస్తానని ఇంటిలో చెప్పి వెళ్లాడు. 21న అక్కడికి చేరుకున్నాడు. అదే నెల 26న ఇలియాస్ కడపకు వెళతానని స్నేహితుడికి చెప్పి అక్కడి నుంచి తిరిగి వచ్చాడు. వచ్చేటప్పుడు బిలాల్ తన దగ్గరున్న డబ్బుతో పాటు 43 తులాల బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి ఇలియాస్ చేతికి ఇచ్చి కడపలో తన బంధువులకు ఇవ్వమని చెప్పి పంపాడు. ఇలియాస్ 26న తెల్లవారుజామున ముంబైలో దిగాడు. అక్కడి నుంచి డార్జిలింగ్‌లో ఉన్న తన రెండో భార్య వద్దకు వెళ్లాడు. తరువాత ఈనెల 6న డార్జిలింగ్ నుంచి హైదరాబాదు వెళ్లాడు. అక్కడ నుంచి బిలాల్‌కు, ఇలియాస్‌కు ఇద్దరికీ స్నేహితుడైన అస్లాం ద్వారా ఈ నెల 8న రాత్రి 11 గంటలకు హైదరాబాదులో బస్సు ఎక్కి శనివారం తెల్లవారుజామున కడప ఏడురోడ్ల కూడలిలో బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే బిలాల్ తన స్నేహితులకు, కుటుంబ సభ్యులకు ఇలియాస్ దుబాయ్ నుంచి కడపకు బంగారును తీసుకుని వచ్చాడని, వస్తే అతడి వద్ద నుంచి అవి తీసుకోవాలని చెప్పారు. తన దగ్గర నుంచి వచ్చినప్పటి నుంచి ఇలియాస్ ఫోను పనిచేయడం లేదని కూడా చెప్పాడు. ఈ క్రమంలో బిలాల్‌కు ఇలియాస్‌కు స్నేహితుడైన అస్లాం గత రాత్రి హైదరాబాదులో బస్సు ఎక్కిన విషయం బిలాల్‌కు తెలిపాడు. ఇలియాస్ కడపలో బస్సు దిగి ఆటో ఎక్కగానే బిలాల్ బంధువు హుసేన్, పర్వేజ్, మరో ఇద్దరు స్నేహితులు కలిసి వెంబడించారు. శివలింగం బీడీ వీధిలోకి రాగానే అక్కడ నుంచి అతడితో వాగ్వాదానికి దిగారు. తరువాత అతడిని కిడ్నాప్ చేసి తమ ఆటోలో తీసుకెళ్లారు. కొంతసేపటికి ఇలియాస్ కిడ్నాప్‌నకు గురయ్యాడని అతడి తల్లి పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన సీఐ ఇబ్రహీం, పోలీసులు ఇలియాస్ ఆచూకీ కోసం వెతికారు. కొంత సమయానికి ఇలియాస్ తాను క్షేమంగానే ఉన్నానని, తన వద్దకు వచ్చిన వారు 33 తులాల బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కెళ్లారని ఫిర్యాదు చేశాడు. బాధితుడిని పోలీసులు విచారించగా తాను బిలాల్ పంపిన 43 తులాల బంగారులో 10 తులాలు అమ్మేసి జల్సా చేశానని, మిగిలిన 33 తులాలు వారు లాక్కెళ్లారని తెలిపారు. మళ్లీ కొంత సేపటికి ఇలియాస్ తాను మొదట భయపడి అలా చెప్పానని, తన స్నేహితులు, బంధువుల వద్ద రూ.26 లక్షల వరకు అప్పులు చేసి బంగారు కొనుగోలు చేసి తీసుకువచ్చేందుకు బిలాల్‌తో పాటు వెళ్లానని తెలిపారు. దీంతో తాను దుబాయిలో బంగారు కొనుగోలు చేశానని చెప్పాడు. తన వెంట తెచ్చిన బంగారులో 10 తులాలు హైదరాబాదులో విక్రయించి జల్సాకు పాల్పడ్డానని, మిగతా 33 తులాలు బిలాల్ తరఫున వచ్చిన వారు లాక్కెళ్లారని తెలిపాడు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

- సీఐ ఇబ్రహీం, కడప టూ టౌన్



ఈ సంఘటనపై సమగ్రంగా విచారిస్తున్నాం. ఎవరు బంగారు కొనుగోలు చేశారు. ఎవరు కడపకు పంపించారు. లేక తీసుకుని వచ్చారు. ఇలియాస్ ఫిబ్రవరి 26న వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏం జరిగిందనే దానిపై సమగ్రంగా విచారణ నిర్వహిస్తున్నాం. బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

నిరుపయోగంగా నగర పంచాయతీ పార్కు





కమలాపురంలోని పార్కు ముఖద్వారం.. పార్కులో పిచ్చిమొక్కలు... పార్కు సమీపంలో నిల్వ ఉన్న మురుగు నీరు

కమలాపురం రూరల్, మార్చి 9 : కమలాపురం పట్టణ ప్రజలకు సేద దీరేందుకు పార్కులు కలగానే మిగిలాయి. దీంతో కమలాపురంలో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. వందల సంవత్సరాల నుంచి పట్టణంలో తహసీల్దారు, కోర్టు, ట్రెజరీ, రిజిస్ట్రేషన్, కార్యాలయాలు అన్నీ ఒకే చోట ఉన్నాయి. అదేవిధంగా కమలాపురం నియోజకవర్గ కేంద్రం కావడంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు ఇక్కడే ఉ న్నాయి. రోజూ వందల సంఖ్యలో సామాన్య ప్రజలతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పట్టణానికి వచ్చిపోతూ ఉంటారు. పనులు ఆలస్యమైనప్పుడు కాసింత సేద దీరేందుకు అనువైన స్థలం లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి సేద తీరుతుంటారు. నగర పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మార్పు చెందినా ప్రజలు సేద దీరేందుకు అనువైన ప్రాంతాలు లేవు. నియోజకవర్గ కేంద్రం మున్సిపాలిటీగా ఉండడంతో పట్టణంలో నివాసం ఉండేందుకు అధిక శాతం మంది మొగ్గు చూపుతున్నారు. పట్టణ జనాభా అధికంగా పెరుగుతుంది. ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, చిన్న పిల్లలు పట్టణంలో ఉన్నారు. కమలాపురం పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో గత టీడీపీ ప్రభుత్వంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పార్కు పనులు చేపట్టారు. పూర్తి చేయలేదు. ఈ పార్కులో పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. పార్కు సమీపంలోనే డ్రైనేజీ కాల్వ అసంపూర్తిగా ఉండటంతో ఆ డ్రైనేజీ కాల్వలో వర్షం నీరంతా నిలిచి పందులకు ఆవాసంగా మారింది. పార్కు సమీపంలోనే రిజిస్టర్ కార్యాలయం ఉండటంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ఈ పార్కులో డ్రైనేజీ నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలకు అసౌకర్యంగా ఉంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఈ పార్కును అందుబాటులోకి తీసుకు రావాలని నగర ప్రజలు కోరుకుంటున్నారు,

పట్టణంలో పార్కుల అవసరం ఉంది



కమలాపురం మున్సిపాలిటీగా మారిన తరుణంలో ఈ ప్రాంతంలో పార్కుల అవసరం ఎంతో ఉంది. నిత్యం ఒత్తిడితో సతమతమవుతున్న నేటి జీవన పరిస్థితుల్లో కాసేపు సేద దీరేందుకు ప్రజలు ఇష్టపడతారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్కులు ఎంతగానో ఉపశమనం కలిగిస్తాయి. అన్ని ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇక్కడ మాత్రం అభివృద్ధి ఆమడదూరంలో ఉంది. - నాగేశ్వర్‌రావు, సీపీఐ నాయకుడు

పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి

ఉద్యానవన పార్కుల ఏర్పాటుకు అధికారులు, పాలకులు ప్రాధాన్యతనివ్వాలి. పార్కు అభివృద్ధి చేయడం వల్ల చిన్నారులు, వృద్ధులకే కాకుండా అన్నివర్గాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. వాటిలో ఆట పరికరాలు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ప్రస్తుతం ఈ పార్కును అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. - గంగవరం శివారెడ్డి

వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

- టీడీపీలోకి భారీగా చేరికలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప అభ్యర్థి మాధవీరెడ్డి



42వ డివిజన్‌లో టీడీపీలో చేరిన వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసు, మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్క. పల్లె), మార్చి 9 :సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస రెడ్డి, కడప నియోజకవర్గ అభ్యర్థి ఆర్. మాధవీరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరం 42వ డివిజన్ రవీంద్రనగర్‌లో జనం అధిక సంఖ్యలో టీడీపీలో చేశారు. వారికి శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు అన్నిరకాలుగా టీడీపీ అండగా ఉంటుందన్నారు. టీడీపీ వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నివర్గాలు నాశనమయ్యాయన్నారు. ప్రశ్నిస్తే దౌర్జన్యాలు, దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీకి సమయం అయిపోయిందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, నరేష్, వాహిద్, సురేష్, భాస్కర్, షకీర్, సుబ్బారెడ్డి, కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీకేఎం వీధిలో...

కడప నగరం బీకేయం వీధి ప్రాంతంలో స్వర్ణకారులు అధిక సంఖ్యలో టీడీపీలో చేరారు. వారికి శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జియావుద్దీన్, జిలానీబాషా, మహ్మద్ బుఖారి తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే సామాజిక రక్షణ



మహిళా ప్రముఖులను సత్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 9: నైతిక విలువలు పెరిగినప్పుడే మహిళలకు సామాజిక రక్షణ లభించగలదని మహిళలు, ప్రముఖులు అభిప్రాయపడ్డారు. శనివారం ఇంటాక్ ఆధ్వర్యంలో స్థానిక మానస సమావేశ మందిరంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భగా మహిళా ప్రముఖులు శివపార్వతి, వసంతమ్మ, వెంకటలక్ష్మి, నాగవేణిలను సంస్థ జిల్లా కన్వీనరు చిన్నపరెడ్డి, కోకన్వీనరు సుబ్బారెడ్డి, కొండూరుజనార్ధన్‌రాజుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, ఆచార్య ఈశ్వర్‌రెడ్డి, మోరరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి, రంగనాథరెడ్డి, జమాల్‌రెడ్డిలు సమాజంలో మహిళల పాత్రపై వివరించారు.

'వంట గ్యాస్ తగ్గింపు ఎన్నికల స్టంట్'

పులివెందుల టౌన్, మార్చి 9: మోడీ ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.100 తగ్గించడం ఎన్నికల్ స్టంట్ అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి అన్నారు. పులివెందుల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర బ్యారెల్‌కు 140డాలర్లు ఉండగా దేశంలో లీటర్ డీజల్ రూ.50కి, పెట్రోల్ రూ.70కి, వంటగ్యాస్ సిలిండర్ రూ.410కి సరఫరా చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధర బ్యారెట్‌కు 80డాలర్లు ఉందన్నారు. అయితే లీటర్ డీజల్ రూ.100, లీటర్ పెట్రోల్ రూ.110, సిలిండర్ రూ.900గా ఉందన్నారు. ఎన్నికల ముందు బెత్తెడు, తర్వాత బారెడు పెంచడం బీజేపీకి అలవాటుగా మారిందని, ప్రజలు గమనించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే పేద మధ్యతరగతి కుటుంబాలు బాగుపడతాయన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బాల ఓబయ్య

కడప (ఎర్రముక్కపల్లె),మార్చి 9: వందల ఎకరాలు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తు న్న వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అందెల బాల ఓబయ్య, షెడ్యూలు కులాల నాయకులు శరత్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం చెర్లోపల్లె పంచాయతీ పగడాలపల్లె పొలం సర్వే నెం.62, 142, 105/1, 102/2,176లో దాదాపు వంద ఎకరాలు కొండ పోరంబోకు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమిని స్థానికంగా ఉన్న కొంత మంది అగ్రవర్ణాల వారు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఈభూమిలో ఇనుప ఖనిజం గనులు ఉండటంతో పెద్దఎత్తున కబ్జాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా విచారణ నిర్వహించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

శివరాత్రి తిరుగు ప్రయాణికులకు అన్నదానం



చెన్నూరులో అన్నదానం చేస్తున్న నేతలు

చెన్నూరు, మార్చి 9 : మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని పలు శైవక్షేత్రాలకు వెళ్లి తిరిగి వస్తున్న ప్రయాణికులు ఆకలితో ఇబ్బంది పడకుండా చెన్నూరు కొత్తరోడ్డులో స్థానిక నేతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఏడాది ఇలా శివరాత్రి తిరుగు ప్రయాణికుల కోసం పెద్దఎత్తున అన్నదానం చేస్తారు. ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం మంచి భోజనం కూడా అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, ఆకలితో ఉన్న ఏ ఒక్కరూ ఇబ్బంది పడకూడదనే తమ ధ్యేయమని, అందుకే గత 15 ఏళ్లుగా చెన్నూరు కొత్తరోడ్డులో ఈ కార్యక్రమం చేడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు నోముల వెంకటరమణారెడ్డి జి.లక్ష్మిరెడ్డి, బిజ్జం సుధాకర్‌రెడ్డి, నరసయ్య, కోళ్ల శివ, జగదీశ్వర్‌రెడ్డి, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో పోలీసుల కవాతు



అంబవరం గ్రామంలో కవాతు చేస్తున్న పోలీసులు

వల్లూరు, మార్చి 9 : రాబోవు ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రశాంతత కోసం ఎలాంటి అవాంఛనీయ సంఘటను జరగకుండా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని అంబవరం, కొప్పోలు గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో పోలీసుల కవాతును సీఐ రామక్రిష్ణరెడ్డి, స్థానిక ఎస్ఐ కత్తి వెంకటరమణాధ్వర్యంలో నిర్వహించారు. గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున అందరూ ప్రశాంతంగా ఉండాలని, ఘర్షణలకు తావు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. చిన్నపాటి ఘర్షణలకు జరగకుండా ఉండేటట్లు చూసుకోవాలని ఏమైనా జరిగితే తక్షణం తమకు స మాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం అందించే వ్యక్తి పేరును గోప్యంగా ఉంచు తామన్నారు. గ్రామంలో అక్రమ మద్యం, చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం బలగాలు డీఎస్పీ విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ పోలీసు కవాతును నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కడప(క్రైం), మార్చి 9 : కడప నగరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గా యాల య్యాయి. కడపకు చెందిన ముగ్గురు యువకులు ద్విచ క్రవాహనం పై వెళుతుండగా రాజారెడ్డి వీధికి చెందిన ఓ మహిళ కారులో ఎదురుగా వచ్చి స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కన్నుల పండువగా పుష్పాభిషేకం



స్వామి వారికి పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), మార్చి 9: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గడ్డిబజార్‌లో వెలసిన కంచి కామకోటి కాళాంబ దేవి సమేత సోమసుందరేశ్వర స్వామి వారికి ఆ ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ ఆధ్వర్యంలో 21 రకాల పుష్పాలతో ప్రత్యేకంగా పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు పుష్పాలు, తీర్థ ప్రసాదాలు, అందజేశారు.

'పులివెందులలో ప్రజాస్వామ్యం ఖూనీ'

పులివెందుల టౌన్, మార్చి 9: పులివెందులలో దశాబ్దాల కాలంగా ప్రజాస్వామ్య ఖూనీ చేయబడుతోందని జైహిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పులివెందులలో జైహిందుస్థాన్ పార్టీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ హాజరై కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యరమల నరేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షులు వల్లెపు గంగాధర తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన

కడప (ఎర్రముక్క.పల్లె), మార్చి 9: నూతన జాతీయ విద్యావిధానంపై ఆదివారం కడప నగరం మేడా కన్వెన్షన్ సెంటరులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ జేఏసీ జిల్లా చైర్మన్ బండి విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిట్టా క్రిష్ణయ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తారన్నారు. ఉపాధ్యాయులంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కడప బస్ డిపో, గ్యారేజీ ప్రారంభం

కడప (మారుతీనగర్), మార్చి 9: కడపలో బస్ డిపో, గ్యారేజీని శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ మల్లికార్జునరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఎం గోపాల్ రెడ్డి, డీఎం డి.డిల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కమలాపురంలో ఆర్టీసీ బస్టాండు ప్రారంభం

కమలాపురం రూరల్, మార్చి 9 :కమలాపురంలో శనివారం ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆర్టీసీ బస్టాండును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలాగే పులివెందుల, కమలాపురం, బద్వేలు మీదుగా నెల్లూరుకు బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

ఆదరించి గెలిపించండి... అందరికీ సాయం చేస్తా

- చిన్నమాచుపల్లెలో బాబుతో భవిష్యత్తు గ్యారంటీలో పుత్తా



టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డికి హారతి పడుతున్న ప్రజలు

చెన్నూరు, మార్చి 9 : 'ఆదరించి గెలిపించండి... అందరికీ సాయం చేస్తా' నని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నమాచుపల్లెలో శనివారం సాయంత్రం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వైసీపీ దుష్టపాలన తరిమికొట్టి సంక్షేమ అందించే చంద్రన్నను సీఎం చేసుకోవాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే చిన్నమాచుపల్లె అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. టీడీపీ వస్తే బీసీలకు వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. పుత్తా రాక సందర్భంగా చిన్నమాచుపల్లెలో యువత ఘన స్వాగతం పలికారు. మహిళలు ఆయనకు హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు మాకం భరత్, కె.రామసుబ్బయ్య, మల్లేల చంద్ర, పుత్తా లక్ష్మీనారాయణ, తిరుపతి, రాజేష్, బీమా, రామమునిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పాలకొండ, మాదినేని భాస్కర్, లోకనాథం, లింగారెడ్డి, ఏకాశి వెంకటసుబ్బయ్య, ఇల్లూరి శ్రీధర్, కట్టా పెద్దన్న, రమణతో పాటు యువనేత క్రిష్ణచైతన్యరెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ



ఐకాన్ విల్లాస్ వద్ద పరిశీలిస్తున్న సీపీఐ సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), మార్చి 9 : కడప నగర పరిధిలో భాకరాపేట వద్ద ఐకాన్ విల్లాస్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి ఇళ్లు పూర్తి చేయకుండా కొనుగోలుదారులను ఇబ్బంది పెడుతున్న ఐకాన్ విల్లాస్ యజమాని రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. శనివారం అసంపూర్తిగా ఉన్న ఇళ్లను సీపీఐ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ ఐకాన్ విల్లాస్‌లో కొంత మంది 90 శాతం డబ్బు చెల్లించి ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని రాజాసింగ్‌ను అనేక పర్యాయాలు కలిసి విన్నవించినా పట్టించుకోకుండా బెదిరింపులకు దిగుతున్నాడని తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారన్నారు. అలాగే విల్లాస్‌కు పడమటి వైపున ఉన్న బుగ్గవంక పోరంబోకు స్థలాన్ని ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా కార్యవర్గసభ్యులు సుబ్రమణ్యం, టి.వలరాజు, టి.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి: డీఈఓ



డీఈఓను సత్కరిస్తున్న టీచర్లు

కడప (ఎర్రముక్క.పల్లె), మార్చి 9 : మహిళా సాధికారతతో దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.అనురాధ పేర్కొన్నారు. శనివారం కడప నగరం శంకరాపురం స్కౌట్ హాలులో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అన్నిరంగాల్లో రాణించడం శుభపరిణామమన్నారు. మహిళాభివృద్ధి విద్య ద్వారా మాత్రమే సాధ్యపడుతుందన్నారు. విద్యాపరంగా అభివృద్ధి సాధించిన దేశాల్లో, రాష్ట్రాల్లో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ప్రమీల మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు యు.భాగ్యవతి, యూటీఎఫ్ నాయకులు పర్వీన్, రూత్ ఆరోగ్యమేరీ, ఏడీ దేవదత్తం, రమణమ్మ శివకుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం

వీరపునాయునిపల్లె, మార్చి 9: మండలంలోని అనిమెల గ్రామ సమీపంలో పావని, పాపాఘ్ని, మొగమోరు నదుల సంగమం వద్ద వెలసిన సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని శనివారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ఆలయ చైర్మన్ శివాంజనేయడ్డి ఆధ్వర్యంలో పురోహితుల పర్యవేక్షణలో హిందూ సాంప్రదాయబద్ధంగా శివపార్వతులను ప్రత్యేకంగా విశేష పుష్పాలతో అలంకరణ చేశారు. బాణసంచా పేలుస్తూ శివపార్వతుల కల్యాణాన్ని జరిపించారు. కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి ఉభయదారులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేసుకునేందుకే రూట్‌మార్చ్: సీఐ



చెన్నూరులో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నూరు, మార్చి 9 : రాబోయే ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసుకునేందుకు రూట్‌మార్చ్ ఏర్పాటు చేసినట్లు సీఐ పార్థసారథి పేర్కొన్నారు. శనివారం చెన్నూరులో రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు పోలీసుస్టేషన్ నుంచి అన్ని ప్రాంతాలను కలుపుతూ కొత్తరోడ్డు వరకు రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రజలకు శాంతియుత వాతావరణం కల్పిస్తామని, సమస్యలు తలెత్తకుండా చూస్తామని, ఓటు నిర్భయంగా వేసుకోవాలని తెలిపారు. కొత్త వ్యక్తులకు అవకాశం ఇవ్వవద్దని, కొత్తవ్యక్తులు కనిపిస్తే తమకు తెలపాలని కోరారు. ప్రజలు గొడవలకు దిగకుండా ప్రశాంతంగా ఓటు వేసుకోవాలన్నదే తమ ధ్యేయమన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దిగినా, ఎన్నికల సమయంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్ఐ నరసింహులు, జాకీర్ హుసేన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసుకుని అభివృద్ధి చెందాలి



మహిళలను సత్కరిస్తున్న ఏపీఎం, సీసీలు

చక్రాయపేట, మార్చి 9: చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ప్రతి మహిళా పారిశ్రామిక వేత్తగా ఎదగాలని వెలుగు ఏపీఎం ఆంజనేయులు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం చక్రాయపేటలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మహిళలు సామాజిక చైతన్య కలిగి సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక వివక్షతను సామూహికంగా ఎదుర్కోవాలన్నారు. మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ రూపుమాపడంలో మహిళ తన హక్కులను రక్షించుకునే విధంగా స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు కృషిచేయాలని తెలిపారు. పాడిపరిశ్రమ మరియు ప్రకృతి వ్యవసాయం అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయంలో ఖర్చులు తగ్గించి ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, సీసీలు సుహాసిని, రాజన్న, నాగేశ్వర్‌రావ్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, మార్చి 9: చక్రాయపేట మండలంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈఈ ప్రవీణ్‌కుమార్‌యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చక్రాయపేట సబ్‌స్టేషన్ నందు మరమ్మత్తు కారణంగా అన్ని ఫీడర్లలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

టీడీపీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు







ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , మార్చి 9 : టీడీపీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు అని నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.శనివారం 3 వవార్డులోని సరస్వతి విద్యామందిరం రోడ్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. బాబు ఆరుగ్యారెంటీల కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నేతలు బాబుల్‌రెడ్డి, తాటిశ్రీనివాసుల యాదవ్, నల్లభాగ్యమ్మ, బండిభాస్కర్‌రెడ్డి, బాలాజీ పాణ్యం సుబ్బరాయుడు,శూలం ప్రసాద్,పొట్టి పాటి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీ, జనసేన, బీజేపీల పొత్తుల ఖరారుతో జగన్ పని అయిపోయిందని ఇక జగన్ ఇంటి బాట పట్టక తప్పదని టీడీపీ నాయకుడు సీఎంసురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి పేర్కొన్నారు. శనివారం అమృతనగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. వీఎస్ ముక్తియార్, శెట్టి పల్లె ప్రభాకర్ రెడ్డి, నల్లబోతుల నాగరాజు.ఎర్రబల్లి దాదాపీర్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: విజన్ వున్న నాయకుడు చంద్రబాబుఅని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్ళి సైకిల్ గుర్తుకు ఓటేయ్యాలని బాబు ఆరు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, బచ్చల పుల్లయ్య, ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు ,నాగమునిరెడ్డి ,పెద్దశెట్టి పల్లె ఉపసర్పంచ్ స్రవంతి, వార్డు సభ్యులు బత్తల బాబయ్యసంగినాదంశ్రీనివాసులు, రామిరెడ్డి నరసింహారెడ్డి,కొడతాల చంద్రన్న, రవీంద్రారెడ్డి, పల్లేటి ప్రతాప్ రెడ్డి, పల్లేటి అశోక్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, వద్దిబాలుడు, కాకుమాని ఆనంద్, ఎర్రన్న, తలారి పుల్లయ్య, నరసింహులు,వంగల నారాయణరెడ్డి, బద్వేలి రవి, చీమలు రాజశేఖర్, పల్లా శంకర్, గోపవరం లక్ష్మణ పాల్గొన్నారు.

ఖాజీపేట..: రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందాలనే ధ్యేయంతో చంద్రబాబు ముందుకెళుతున్నారని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శనివారం ఖాజీపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మైనార్టీ కాలనీ, సిద్ధాంతిపురం, చెర్లోపల్లెలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు జనసేన ఇన్‌చార్జి మల్లోత్ర, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, వెంకటసుబ్బయ్య, వీరయ్య, సుబ్బ య్య, హరినాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కదిరుల్లా, జలీల్, కేకేబ్రదర్స్ హబీబ్, దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, జనకీరాం, రమేష్‌నాయుడు, రామానాయుడు, క్రిష్ణారెడ్డి, నాగశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు టౌన్..: వైసీపీ అరాచక పాలనను ఇంటికి సాగనంపుదామని నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రోశన్న అన్నారు. శనివారం ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా మున్సిపల్ పరిధిలోని చాకలివీధి, చౌడమ్మవీధి, అశోక్‌నగర్, దూదేకులవీధి, జాంబవతినగర్, రూపరాంపేట వీధుల్లో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఖాజీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్



బద్వేలులో ప్రచారం నిర్వహిస్తున్న రితీష్‌రెడ్డి, బొజ్జ రోశన్న

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 9: యోగివేమన యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆరుగురు 10కి 10 జీపీఏ సాధించి యూనివర్సిటీ ర్యాంకును సాధించారని కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మొదటి సెమిస్టర్ కంప్యూటర్ సైన్స్‌లో ప్రణీత, గౌసబీ, ఆదిత్యవర్ధన్, సాజిత్‌హుస్సేన్, మన్విత్తారెడ్డి, సాజితా రెహమానీ 10 జీపీఏ సాధించారన్నారు. బీకాంలో సోనియా 9.5, మూడో సెమిస్టర్ ఎంఎస్‌సీఎస్‌లో నాగసుశ్మిత 9.51, మీనా 9.32, చాంద్‌బీ 9.12 జీపీఏ సాధించారు. ఎంఎస్‌సీఎస్‌లో అనూష 8.90, జ్యోతిస్వరూప్ 8.84, బీకాంలో అతీఫాభాను 8.83, వినీత 8.64, 5వ సెమిస్టర్ ఎంఎస్‌సీఎస్‌లో మౌనిక 9.11, లలిత 9.04, ఎంఎస్‌సీఎస్‌లో చంద్రిక 9.14, శ్రీదీక్షిత 8.74, బీకాంలో శ్రీదేవి 8.62, ధరణి 8.50 జీపీఏ సాధించారన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కరస్పాండెంట్, కళాశాల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు రామలక్ష్మిరెడ్డి, నాగరాజు, అధ్యాపకులు అభినందించారు.

యూనివర్సిటీలో ప్రభుత్వ డిగ్రీ విద్యార్థిని ప్రతిభ



సుజిత

మైదుకూరు, మార్చి 9 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదివిన విద్యార్థిని యూనివర్సిటీలో 10కి 10 గ్రేడింగ్ తెచ్చుకొని మొదటి స్థానం పొందింది. ఈ మేరకు ప్రిన్స్‌పాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ బీయస్సీలో కె సుజిత 10 పాయింట్లతో మొదటి స్థానం పొందిందని తెలిపారు. అలాగే స్థానిక మేధా డిగ్రీ కళాశాల విద్యార్థిని నాగప్రవల్లిక బీయస్సీ బాటనీలో 10 గ్రేడింగ్ సాధించి యూనివర్సిటీ స్థాయిలో ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ నరసింహులు తెలిపారు.

ఘనంగా శివపార్వతుల ఊరేగింపు



కోలాటం చేస్తున్న మహిళలు

ఖాజీపేట, మార్చి 9: శివరాత్రి ముగింపు సందర్భంగా మండల పరిధిలోని అగ్రహారం, నాగనాథేశ్వరుల కొండలో శివపార్వతులను ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అగ్రహారం శివాలయంలో శివపార్వతులను భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించడతోపాటు చెక్కభజన, కోలాటం పలువురిని ఆకట్టుకున్నాయి.

వైభవంగా గంగమ్మ,పాలేటమ్మ తిరునాళ్ల



గంగమ్మను దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు

ముద్దనూరు మార్చి9 :మండల పరిధిలోని బొందలకుంట గ్రామంలో వెలసిన గంగమ్మ గుడి వద్ద శనివారం గంగమ్మ తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా గుడిలో కొలువై ఉన్న గంగమ్మ, పాలేటమ్మకు ప్రత్యేక అలంకరణ చేశారు. అంతేకాకుండా తిరునాళ్లలో చెరుకులు, వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేశారు. మండలం నుంచే కాకుండా పక్క మండలాల నుంచి భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. భక్తులు కుంటలోని నీటిలో కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకొని అమ్మవార్లను దర్శించుకొని కాయ, కర్పూరం సమర్పించారు. భక్తులకు ధర్మకర్తలు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

బటన్ ముఖ్యమంత్రికి ఓటేయొద్దు : కుంచం

జమ్మలమడుగు, మార్చి 9: రాష్ట్రంలో బటన్ నొక్కే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఓటు వేయవద్దని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం జమ్మలమడుగు ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్ రెడ్డి ముందుగా వివేకా హత్యకేసు తేల్చాలని, అంతవరకు ఆయన ప్రజలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. ముఖ్యమంత్రి వలన రాష్ట్రం అప్పులపాలు అయిందని ఎలాంటి అభివృద్ధి లేకుండా రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడారని, చదువుకున్న నిరుద్యోగులు వయస్సు దాటిపోయి ఉద్యోగాలు, ఉపాధికి వలస వెళుతున్నారన్నారు.2024 సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమ రాష్ట్ర సమితి అభ్యర్థులను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కడప లోక్‌సభకు కుంచం వెంకటసుబ్బారెడ్డి, రాజంపేట లోక్‌సభకు డి.క్రిష్ణప్రసాద్, రాజమండ్రి లోక్‌సభకు కోడూరు వెంకటసత్యనారాయణమూర్తి, దొడ్డబళ్లాపురం ఎస్.రామ్‌ప్రసన్న, మచిలీపట్నం బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, అనంతపురం కె.చంద్రమోహన్, గుంటూరు యు.వీరాంజనేయరెడ్డిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ఎస్ సమితి నాయకులు పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

పోరుమామిళ్ల, మార్చి 9 : శివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు వెళ్లి తిరిగి వస్తున్న శివభక్తుల కోసం రంగసముద్రానికి చెందిన రుద్రవరం నాగేంద్ర ప్రసాద్ ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం ఆయన అంబేడ్కర్ సర్కిల్‌లో ఈ మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేసి భక్తులకు, ప్రయాణికులకు ఉచితంగా పంపిణీ చేశారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లి తిరిగి తమ గమ్యస్థానాలకు వెళ్లే భక్తుల కోసం ఈ ఉచిత మజ్జిగకేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు, మార్చి 9 : మహాశివరాత్రి పండుగ సందర్భంగా అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయం వద్ద శనివారం సాయంత్రం ఎద్దులకు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అనంతపురంజిల్లా గార్లదిన్నె గ్రామానికి చెందిన రమేష్ ఎద్దులు మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వల్లూరు మండలం బాలుగారిపల్లె గ్రామానికి చెందిన రమణారెడ్డి ఎద్దులు రెండో బహుమతి రూ.70,116 గెలుచుకున్నాయి. కర్నూలుజిల్లా ప్యాపిలీ మండలం పీఆర్‌పల్లె గ్రామానికి చెందిన నాగయ్య ఎద్దులు మూడో బహుమతి రూ.60,116 గెలుచుకున్నట్లు వారు తెలిపారు. విజేతలకు ఆ గ్రామ సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఆదేవస్థానం ఛైర్మన్ గోసుల వెంకటసుబ్బారెడ్డి బహుమతులను పంపిణీ చేశారు.

● **ముగిసిన శివరాత్రి ఉత్సవాలు..:** అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 8 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు శనివారం ముగిశాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దైవదర్శనం చేసుకున్నారు. కాగా దేవస్థానం వారు సరైన సౌకర్యాలు కల్పించలేదని భక్తులు ఆరోపించారు. తాగునీటికి చాలా ఇబ్బంది పడ్డారు. కుందూ నది బ్రిడ్జిపై రాత్రిపూట లైట్లు ఏర్పాటు చేయలేదు. చీకటిగా ఉండడంతో శుక్రవారం అర్ధరాత్రి రెండు స్కూటర్లు ఢీకొనడంతో సీతారామపురం గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి తలకు బలమైన గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన మరొక బాలుడు స్కూటర్ అదుపు తప్పడంతో ఆ బ్రిడ్జి మీద నుంచి నదిలో పడటంతో కాలికి గాయమైంది. కాగా పోలీసులు కూడా అందుబాటులో లేకపోవడంతో పలువురు విమర్శిస్తున్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి



శ్మశానంలో తవ్విన గుంతను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 9: రూరల్ పరిధిలోని తాళ్లమాపురం పంచాయతీ, మూలవారిపల్లె పంచాయతీ హరిజనవాడ శ్మశాన స్థలం ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు నరసింహులు, ఓబులేసు కోరారు. శ్మశాన స్థలంలో గుంత తవ్వడంపై గ్రామ ప్రజలు ఫిర్యాదు చేయడంతో శనివారం వీఆర్వో నరసింహస్వామి శ్మశాన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు నరసింహులు, కె. ఓబులేసు మాట్లాడుతూ గ్రామంలో మాదిగలకోసం 71 సెంట్ల శ్మశానస్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందన్నారు. 40 సెంట్ల స్థలం ఆక్రమణలకు గురైందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 30 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొద్దిరోజుల క్రితం పెద్ద గుంత తవ్వారని పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకొని శ్మశాన స్థలాన్ని కాపాడాలని కోరారు.

వీరభద్రునికి రూ.5.47 లక్షలు ఆదాయం

చాపాడు, మార్చి 9 : మహాశివరాత్రి పండుగ సందర్భంగా అల్లాడుపల్లె వీరభద్రస్వామికి మొత్తం రూ.5,47,156 ఆదాయం వచ్చినట్లు ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు తెలిపారు. దైవదర్శనం టిక్కెట్లు విక్రయించగా రూ.1,42,151, హుండీల ద్వారా రూ.2,38,445, లడ్డూలు విక్రయించగా రూ.1,16,110, తాత్కాలిక దుకాణాల ద్వారా 50,450 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ డబ్బులు బ్యాంకులో జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

శివాలయంలో ఊంజల్ సేవ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, మార్చి 9: పోరుమామిళ్లలోని బాలా త్రిపుర సుందరీదేవి, రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి అత్యంత వైభ వంగా ఊంజల్ సేవ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా బాలా త్రిపుర సుందరీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నిర్వాహకులు ఉత్సవ విగ్రహాలను ప్రధాన రహదారులు, పురవీధుల్లో ఊరేగింపుగా గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



చెత్తా చెదారం తొలగిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 9: విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో గోపవరం పంచాయతీలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్లను ఊడ్చి రోడ్లకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.వి.రాఘవరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగభూషణం శర్మ, ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్ష

కొండాపురం, మార్చి 9 : మండలంలోని చౌటిపల్లె గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు.5 వతరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12-30 వరకు పరీక్ష జరుగుతుందన్నారు.అదేవిధంగా జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4-30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నేడు వెల్లాలలో ప్రవేశపరీక్ష

రాజుపాలెం, మార్చి 9 : మండల పరిధిలోని వెల్లాల గ్రామంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం ఆదివారం ఉదయం 10గంటలకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి12 వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు పరీక్ష ఉంటుందన్నారు. సమాచారం కోసం 9440534509 అనే నంబరును సంప్రదించాలని ఆమె ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలి

ఖాజీపేట, మార్చి 9: కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుకునేందుకు విద్యార్థినులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.భార్గవి అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి 6వ తరగతికి 40 మంది, 11వ తరగతికి 40 మంది, 7వ తరగతికి 8 మంది ఆన్‌లైన్‌లో 12వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ చేసుకోలేనివారు విద్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే ఆధార్‌కార్డు, సంరక్షకుల ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబరుతో ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా మెసేజ్ వస్తుందని, ఇంటర్ విద్యార్థులకు మాత్రం ఒక పాఠం పూర్తిగా చదవగలిగితే వారిని పూర్తిగా ఎంపిక చేస్తామన్నారు. అలాగే అనాథలు, స్కూల్‌వలంటరీ విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, పేద, బీసీ మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువనున్న విద్యార్థినులు మాత్రమే ప్రవేశానికి అర్హులన్నారు.

పారామిలటరీ బలగాలతో కవాతు



జమ్మలమడుగు, మార్చి 9: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు పట్టణంలో శనివారం డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమం డీఎస్పీ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైంది. పాత బస్టాండు, మార్కెట్‌వీధి, మెయిన్‌బజార్, తాడిపత్రి రోడ్డు తదితర వీధుల్లో కేంద్ర బలగాలతో స్థానిక పోలీసు అధికారులు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో అభద్రతాభావాన్ని పోగొట్టేందుకు జమ్మలమడుగు పోలీసు నీడలో ఉంటుందని తెలియజేస్తూ పోలీసు అధికారులు, వారి సిబ్బంది కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను పరామర్శించిన నేతలు



పోరుమామిళ్ల, మార్చి 9 : బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మను టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు భైరవ ప్రసాద్, జిల్లాకార్యదర్శి తిరుమలశెట్టి సుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, గాలి మురళి తదితరులు పరామర్శించారు. ఇటీవల ఆమెకు ఎడమ చేయి ఫ్యాక్చర్ కావడంతో ఆమె బద్వేలుకు వచ్చిన విషయం తెలుసుకున్న వారు శనివారం ఆమెను పరామర్శించారు.

అధ్వానపు రోడ్డులో అగచాట్లు

● నత్తనడకన రోడ్డు పనులు ● ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులకు రోగాలు ● పొలంలో వెళుతున్న బస్సు సర్వీసులు





పొలాల వెంబడి వెళుతున్న ఆర్టీసీ బస్సు , రోడ్డుపై ఉన్న కంకర కుప్పలు

జమ్మలమడుగు, మార్చి 9: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం ప్రధాన రోడ్డు ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పల పాడు గ్రామం వద్ద నుంచి పెద్దముడియం మండలం గుండ్లకుంట వరకు, అక్కడి నుంచి బోడితిప్పనపాడు, పాలూరు, పెద్దముడియం, సుద్దపల్లె గ్రామం వరకు రోడ్డు దారుణంగా మారింది. రెండు సంవత్సరాలుగా గుండ్లకుంట నుంచి ఆళ్లగడ్డకు వెళ్లే దారి తీవ్ర అసౌకర్యంగా మారింది. గత ఒకటిన్నర సంవత్సరం నుంచి సుమారు 15 కి.మీ. వరకు రోడ్డు గుంతలు పడి ద్విచక్ర వాహనదారులకు ప్రయాణం సమస్యగా మారింది. ముందుగా ఆ రోడ్డున వెళ్లాలన్నా ద్విచక్ర వాహనంలో వెళ్లే వారికి నడుమునొప్పులు, మోకాళ్లనొప్పులు, కళ్లమంటలు తదితర రోగాలు దరి చేరుతాయని బస్సు, ఇతర వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ఎగసిపడి ద్విచక్ర వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. ప్రస్తుతం బోడితిప్పనపాడు గ్రామ శివార్ల నుంచి పలుచోట్ల కంకర పరిచారు. మరికొన్ని చోట్ల కంకర కుప్పలు వెలిశాయి. జమ్మలమడుగు, ఆళ్లగడ్డ వెళ్లే బస్సు సర్వీసులు సుమారు ఆరు బస్సులు ఆ దారిలో వెళుతుంటాయి. రోడ్డు నిర్మాణం చేపట్టక బస్సు సర్వీసులు పొలాల్లో వెళుతున్నాయి. దీంతో బస్సు వెనుకల ద్విచక్ర వాహనదారులు వెళ్లాలన్నా దుమ్ము, ధూళితో అలర్జీలు తదితర చర్మ రోగాలు వస్తున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యకు సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని, పనులు వేగవంతం చేసి ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చేయాలని ప్రజలు వాపోతున్నారు.